క్లుప్తంగా

పారదర్శకంగా పంట కోత ప్రయోగాలు

వాల్మీకిపురం: ఆర్‌బీకే పరిధిలో నిర్వహించే పంటకోత ప్రయోగాలు పారదర్శకంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి హేమలత అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌బీకే కేంద్రంలో మండల స్థాయిలో ఆర్‌బీకేల ఇన్‌చార్జ్‌లకు పంటకోత ప్రయోగాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటకోత ప్రయోగాలు ఎలా చేయాలి, వివరాలను ఎలా యాప్‌లో నమోదు చేయాలన్న అంశాలపై ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో శ్రీదుర్గా, ఏఈవో నాగరాజు, ఆర్‌బీకేల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబిత పక్రియ వేగవంతం చేయాలి

తంబళ్లపల్లె: నూతన ఓటర్ల జాబిత రూపొందించే పక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎన్నికల అధికారి సందీప్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా పై సమీక్ష చేశారు. నియోజకవర్గంలోని బి.కొత్తకోట, కురబలకోట, తంబళ్లపల్లె, పెద్ద మండ్యం, ములకలచెరువు,పెద్దతిప్పసముద్రం రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేపై ఆరా తీశారు.

80 శాతం రాయితీతో ఉలవలు

పీలేరు రూరల్ : మండలంలోని రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఏవో రమాదేవి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ 2023లో వర్షాధార పంటలైన వేరుశెనగ, కంది, ఇతర పంటలు 44 శాతం మాత్రమే సాగులో ఉన్నట్లు తెలిపారు. నవంబరు నెలలో రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు సాగు చేసుకోవచ్చునని చెప్పారు. రైతు భారో కేంద్రాల్లో 80 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఉలవలు కావాల్సిన రైతుల 11వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

పీలేరురూరల్ : ఈ నెల మూడో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను వియవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కే.ఎన్. రాజు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు హలో మాదిగ చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ ఉప కులా వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయన్నారు. మాదిగల చివరియుద్ధంగా నిర్వహిస్తున్న ఈ సభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కో ఇన్‌చార్జి దేవరాజ్‌మాదిగ, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్. సుధాకర్‌బాబు, మండల ఇన్‌చార్జి ఎర్రబల్లి మహేష్, నాయకులు కె. ప్రసాద్, అశోక్, శ్రీనివాసులు, గురుమోహన్, విజయకుమార్, శ్రీనివాసులు, గండికోట వెంకటేష్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్ నియామకం

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలకు హిందీ సబ్జెక్టు బోధించడానికి విద్యా వలంటీర్‌గా మమతను నియమించినట్లు అమ్మ సర్వీస్ సొసైటీ సెక్రటరీ గణేష్ తెలిపారు. పాఠశాలలో హిందీ సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో వలంటీర్‌ను నియమించడం జరిగిందన్నారు. ఆమెకు నెలకు రూ.8 వేలు తమ సంస్థ తరపున అందజేస్తున్నట్లు తెలిపారు. సోమవారం వలంటీర్‌కు రూ.8వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ ,సంస్థ ఫౌండర్ సుబ్రమణ్యం, జయకృష్ణ పాల్గొన్నారు.

దంత వైద్య కేంద్రం ప్రారంభం

బి.కొత్తకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన దంత వైద్య కేంద్రాన్ని సోమవారం వైద్య విధాన పరిషత్ మాజీ అడిషనల్ కమిషనర్ సుబ్బరాము ప్రారంభించారు. బి.కొత్తకోట నగర పంచాయతీ ప్రజలకు దంతవైద్య సేవలు అందుబాటులోకి తేవడం కోసం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి పరికరాలను మంజూరు చేయించారు. వీటిని ప్రత్యేక కేంద్రంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆరీఫుల్లా, హసీనాబేగం, దంత వైద్యురాలు దుర్గాదేవి, సీహెచ్‌సీ కమిటీ సభ్యులు నక్కా మహేష్, కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి వ్యాధి నిరోధకత ప్రభుత్వ లక్ష్యం

పీలేరు : పూర్తి వ్యాధి నిరోధకత ప్రభుత్వ లక్ష్యమని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాండ్ల, మొరవపడ్డిపల్లెలో ఆరు రోజుల పాటు నిర్వహించాల్సిన ఐఎంఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్లు సెషన్ సైట్‌లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డ్రాపౌట్స్, లెఫ్టౌట్స్, డ్యూ లిస్ట్ ఉన్న పిల్లల జాబితా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. హబ్ కట్టర్, ఏఈఎఫ్ఐ కిట్, రెడ్, బ్లాక్ కలర్ బ్యాగ్స్, దూది ఉండలు, సిరేంజిస్ పరిశీలించి, వ్యాక్సిన్ కోల్డ్ చైన్ శీతలీకరణ నాణ్యతను తనిఖీ చేశారు.

పరిశుభ్రతే లక్ష్యంగా జంగిల్ క్లియరెన్స్

- బాహుదా, బుగ్గ కాలువలల్లో పరిశుభ్రత పనులు
- జగనన్నకు చెబుదాం ఫిర్యాదుపై మున్సిపల్ అధికారుల స్పందన
- రూ.8లక్షలతో జంగిల్ క్లియరెన్స్ పనులు
- మురుగు కాలువ శుభ్రం చేయడంపై ప్రజల హర్షం





మేదరవీధి వెనుకవేపు బుగ్గకాలువలో పారిశుధ్యపనులకు ముందు, తరువాత

మదనపల్లె : ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గుబురుగుబురుగా ముళ్ల కంపలు, ఎక్కడ చూసినా చెత్త, పనికిమాలిన వ్యర్థాలు, నిల్చిన మురుగునీరు, ముక్కులు భరించలేని దుర్వాసన.. ఇది ఒకప్పటి బాహుదా, బుగ్గ కాలువల తీరు.. నేడు ఎటునుంచి చూసినా పరిశుభ్రంగా కనిపిస్తూ..ఎలాంటి వ్యర్థాలు లేకుండా శుభ్రంగా, ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి. మదనపల్లె పట్టణంలో ముగ్గురాళ్ల వంక నుంచి మేదరవీధి చివరివరకు ఉన్నటువంటి బుగ్గకాలువ, వరాల ఆంజనేయస్వామి గుడి నుంచి పాత ఎమర్జెన్సీ ఆస్పత్రి వరకు విస్తరించినటువంటి బాహుదా కాలువ రెండూ అపరిశుభ్రంగా, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో ఉండేవి. ఈ రెండు వంకలను ఆనుకుని ఉన్నటువంటి ఇళ్లలోని ప్రజలు వ్యర్థాలను, మురుగునిల్వలను కాలువలోకి యథేచ్ఛగా వదిలేయడంతో దుర్వాసన భరించలేనిదిగా ఉండేది. దీనికి తోడు పాములు, దోమల బెడద అధికంగా ఉందని, రాత్రివేళల్లో ఇళ్లలో ఉండలేకపోతున్నామంటూ పలుమార్లు ప్రజలు గతంలో స్పందనలోనూ, ప్రస్తుతం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు సమర్పించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డిలు ఈ రెండుకాలువలు వెళ్లే వార్డుల్లో పర్యటించినపుడు స్థానికులు ఈ సమస్యను వారి దృష్టికి తెచ్చి పరిష్కరించాల్సిందిగా కోరారు. దీంతో వారి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రూ.8లక్షల నిధులతో బుగ్గకాలువలో 4కి.మీ, బాహుదాకాలువలో 2కి.మీ. మొత్తం 6కి.మీ. మేర జంగిల్‌క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. హిటాచీ, జేసీబీతో రెండు కాలువల్లోనూ పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లను తొలగించి, మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాట్లుచేశారు. వర్షాకాలం నేపథ్యంలో వర్షపునీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రవహించేందుకు కాలువను వెడల్పుచేశారు. పరిశుభ్రంగా ఉంచారు. దీంతో స్థానిక ప్రజలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన పనులపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బాహుదా, బుగ్గకాలువ పరివాహకప్రాంతాల్లోని ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇళ్లలోని చెత్త, వ్యర్థాలను కాలువలోకి పడేయకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన చెత్తబుట్టల్లోకి వేసి ఇంటివద్దకు వచ్చిన కార్మికులకు అందజేయాలి. ఇళ్లలోని మురుగునీటిని వంకలోకి మళ్లించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కాలువను శుభ్రం చేశాం. ఎప్పటికప్పుడు పిచ్చిమొక్కలు పెరగకుండా శుభ్రంగా ఉంచేలా చూస్తాం. ప్రజలు సహకరిస్తేనే బాహుదా, బుగ్గకాలువలు శుభ్రంగా ఉంచేందుకు వీలవుతుంది. **- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె**

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లుగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం సర్పంచ్ జి.శ్రీవాణి ఆధ్వర్యంలో వెంగంవారిపల్లె పంచాయతీలోని బాలినాయనపల్లె, బాలినాయనపల్లె హరిజనవాడ తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే గ్రామంలోని బస్టాప్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటుచేయనున్న స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా స్థానికులు బస్సు షెల్టర్ ఏర్పాటుచేయాల్సిందిగా విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ప్రభుత్వభూమిలో ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకి స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రెండురోజుల్లో బస్సు షెల్టర్ పనులు మొదలుపెడతామంటూ ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ ఆర్.ఐ.రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నవీన్‌తో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులను పలుకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా?, అధికారుల పనితీరు ఎలా ఉంది? స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అవసరమైన సిమెంట్‌రోడ్లు, మురుగునీటికాలువల నిర్మాణం, తాగునీటి కొళాయిల ఏర్పాటు, పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరు, రెవెన్యూసమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు. ప్రజల కోసం పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారం చేపట్టేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, దూకుడువెంకటరమణ, శ్రీనివాసులుశెట్టి, నాగరాజ, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆవరణంలో సెప్టెంబర్ 9వ తేది జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు సివిల్ కోర్టు 1వ అడిషినల్ జూనియర్ జడ్జి మాధవి అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో జడ్జి మాట్లాడుతూ క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, బ్యాంకు సంబంధిత కేసులన్నీ జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో ఒకే రోజులో కేసులను పరిష్కరించుకోవచ్చునని సూచించారు. కోపం, ఆవేశాలతో దీర్ఘకాలం కేసుల పేరుతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా కక్షిదారులు ఇరు వర్గాలు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జడ్జి సూచించారు.

విద్యాసామగ్రి వితరణ

తంబళ్లపల్లె: జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా చేనేత కార్మికులు విద్యాభివృద్ధికి చేయూతనిచ్చారు. విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణగా ఇచ్చారు. మండలంలోని శ్రీనివాసకాలనీ, కురవపల్లె, దాదంవడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలల్లోని 70 మంది విద్యార్థులకు చేనేత కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. వారి దాతృత్వానికి టీచర్లు సుజాత, నిర్మల, మెహరూన్‌లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు నరసింహులు, శంకర, శశికుమార్, వెంకటరమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

నిమ్మనపల్లె: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎంఈఓలు ఎంఆర్ పద్మావతి, నారాయణ, రాజగోపాల్ అన్నారు. సోమవారం ముష్టూరులోని కేజీబీవీలో గత విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో అవార్డు అందుకున్న సబియాకు జిల్లా స్థాయిలో కూడా ప్రథమ స్థానం నిలిచినందుకు జీసీడీఓ ద్వారా మంజూరైన రూ.50 వేలు ప్రతిభాసాయం, ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు నజీర్‌అహ్మద్ ,షకీల దంపతులను సన్మానం చేశారు. సబియా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడం కేజీబీవీకి ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ స్పెషల్ ఆఫీసర్ జరీనాబేగం, సిఆర్‌పి సుధాకర్ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరించాలి

నిమ్మనపల్లె : చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంఈఓ ఎం.ఆర్.పద్మావతి అన్నారు. సోమవారం మండలంలోని తవళం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయచేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. చేనేత వస్త్రాలు భారతీయ వారసత్వ సంపదని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మగ్గాలపై నేసే వస్త్రాలు నాణ్యతతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. జాతీయ చేనేత దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మీనానాగలక్ష్మి, ఉపాధ్యాయులు కృపానందం, హరిప్రసాద్, మధు, శ్రీలత, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతి

తంబళ్లపల్లె: మండలంలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తోందని , రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల సహకారంతో అభివృద్ధిలో ఉందని, ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ఆలయ మాజీ చైర్మన్ బొట్టు శంకర్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, శివారెడ్డిలు చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆలయం ఎదుట గాలిగోపురం , పుష్కరణి, తంబళ్లపల్లె,కడపక్రాస్, గోళ్లపల్లె వద్ద టీటీడీ ఆర్చ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతన టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు మేలు చేసేందుకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు

మదనపల్లె : భూసారపరీక్షలు, విత్తనాలు, ఎరువుల నాణ్యత పరిశీలనకు రాష్ట్రప్రభుత్వం వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్‌ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చిందని ఏడీఏ శివశంకర్ అన్నారు. సోమవారం మదనపల్లె మార్కెట్‌యార్డులోని డాక్టర్.వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో అన్నమయ్యజిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, ములకలచెరువు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏఓ, ఏఈఓలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి విత్తన మొలకశాతం, తేమశాతం, భౌతిక స్వచ్ఛత, ఎరువుల నాణ్యత, మట్టిపరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. జిల్లాలో రైతులు వ్యవసాయం రంగంతో పాటు పాడిరంగంపై ఆధారపడి జీవిస్తున్నందున పశువులకు సంబంధించిన రక్తం, పేడ, వాటికి ఉండే రోగాలతో పాటుగా పాలు నాణ్యత వంటివి ల్యాబ్‌లలో పరీక్షించుకోవచ్చన్నారు. ఏఓ ఝాన్సీలక్ష్మి, ఏఈఓ వెంకటేశ్వరరెడ్డి, ఫిరోజ్ పాల్గొన్నారు.



అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పేదల పక్షపాతి జగన్‌ను ఆశీర్వదించాలి

పీలేరు : పేదల పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో అందరూ ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని చెన్నారెడ్డివీధి, ఎస్వీ మహల్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలు అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చారని తెలిపారు. మరింత అభివృద్ధిని కాంక్షిస్తూ వచ్చే ఎన్నికల్లో జగన్‌కు పట్టం కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జీ.వి. రాకేష్‌రెడ్డి, పార్టీ రాయలసీమ జిల్లాల మహిళా కోఆర్డినేటర్ మహితా ఆనంద్, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, విక్టరీ వెంకటరమణారెడ్డి, ఎస్.వి. చలపతి, ఉదయ్‌కుమార్, బాలంనరేంద్రరెడ్డి, లక్ష్మీరెడ్డి, కంభం భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హబీబ్, జహంగీర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

పీలేరు : జాతీయ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం పీలేరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధికార ప్రతినిధి సుంకర చిన్నరెడ్డిబాబు మాట్లాడుతూ అర్హత కల్గిన చేనేత కార్మికులకు 3 సెంట్లు స్థలం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. 100 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి సిబ్బాల వెంకటరమణ, నాయకులు కృష్ణయ్య, చంద్రయ్య, రామకృష్ణ మూర్తి, నాగరాజ, ఈశ్వరయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని వెంకటేశ్వరపురంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చేనేత నాయకులు గుదిటి సుధాకర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. చేనేత మగ్గాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రామయ్య, రామక్రిష్ణ, రామచంద్ర, యువరాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

కలకడ : చేనేత కార్మికులకు అండగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మండల రైతుభరోసా కేంద్రాల చైర్మన్ చింతకుంట హరినాథరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని కోన సచివాలయంలో సర్పంచ్ జల్లా రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో చేనేత కార్మికులు సి.సిద్దయ్య, బి.రెడ్డెప్పలను సన్మానించారు.

విప్లవ సాంస్కృతిక యుగకర్త గద్దర్



ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె : ప్రజా ఉద్యమాలకు, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు అంకితమై తన ఆట, పాట, మాటలతో కోట్లాది ప్రజల హృదయాలను కదిలించిన ప్రజాగాయకుడు గద్దర్ విప్లవ సాంస్కృతిక యుగకర్త అంటూ పలువురు కొనియాడారు. అమరుడైన గద్దర్ ఆకస్మిక మృతికి సంతాపసూచకంగా సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద పౌరహక్కులసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నాగేశ్వరరావు, మాలమహానాడు రాష్ట్ర నాయకులు యమలాసుదర్శన్, ప్రజాకవి పోతబోలురెడ్డెప్ప, అంబేద్కర్ యువజన సంఘం చంద్రశేఖర్ తదితరులు విప్లవ జోహార్లు తెలిపారు. స్థానిక బహుజన్ సమాజ్‌వాది(బీఎస్పీ) పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండెలగౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. త్వరలో పట్టణంలోని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి గద్దర్ సంతాపసభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శ్యాంసుందర్, రమణ, మహేష్, గంగాధర్, ప్రశాంత్, పెద్దోడు, ఆనంద్, మాసువల్లి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘనంగా నివాళి

పెద్దతిప్పసముద్రం: స్థానిక బస్టాండ్‌లోని అబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్ర పటానికి ఘనంగా నివాళి అర్పించారు. ఎంపీపీ మహమూద్, డీపీఎంసీ సభ్యుడు కేవీ రమణ, బాస్ నాయకులు రామచంద్ర, కాట్నగల్లు రమణ, లక్ష్మీనారాయణ, ఉత్తన్న తదితరులు మాట్లాడుతూ ప్రజా హక్కుల కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారుడి మరణం విచారకరమన్నారు.

పేదల గుండె చప్పుడు గద్దర్

వాల్మీకిపురం: జననాట్యమండలి వ్యవస్థాపకుడు, ప్రజాకవి గద్దర్ పేదల గుండె చప్పుడు అని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు శివయ్య, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు వెంకటస్వామి అన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రజా కవి ద్దర్ ఆకస్మిక మరణం పట్ల నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా యుద్ధ నౌక గద్దర్ పోరాటపటిమ, ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, మధుసూదన, ప్రభాస్, అజయ్, నందమూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం మొదటి దశలో పట్టణంలో 5వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ఈ మొక్కలన్నీ పండ్ల, పూల మొక్కలన్నారు. వారి వారి ప్రాంతాల్లో రోడ్డు పక్కల ఈ మొక్కలను నాటి సంరక్షించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని సంరక్షించుకునే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. పంచాయతీ అధికారులు సైతం శ్రద్ధ తీసుకొని పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా అందమైన కానగ, వేప, దానిమ్మ, ఉసిరి, అల్లనేరేడు, జామ, తదితర మొక్కలను నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే చింతల చేతులమీదుగా మొక్కలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్ రాయల్, సురేష్ రెడ్డి, రఘు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 45 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఆర్డీఓ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కురబలకోట మండలం గౌనివారిపల్లె గ్రామానికి చెందిన ఎస్.సులోచన తమకు వారసత్వంగా వచ్చిన ఆస్తికి సంబంధించి తమ పేరుమీద అన్ని రికార్డులు ఉన్నప్పటికీ... కొందరు వ్యక్తులు అన్‌రిజిస్టర్డ్ అగ్రిమెంట్ సహాయంతో భూమి తమదిగా చెప్పుకుంటున్నారని ఎస్.సులోచన ఫిర్యాదు చేసింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది లింకు డాక్యుమెంట్స్, పాసుపుస్తకం, 1బి, అడంగల్ లేకుండానే రిజిస్టర్ చేస్తున్నారని ఫిర్యాదుచేశారు. తక్షణమే తమ భూమికి సంబంధించి చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాల్సిందిగా వినతిచేశారు. సీటీఎం-2 పంచాయతీలో జగనన్న నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాలు మంజూరుచేసినప్పటికీ, తమకు ఇప్పటివరకు స్థలం చూపలేదని చిలకవారిపల్లె గ్రామస్తులు వినతిచేశారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర ప్రగతి



వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తాటిగుంటపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నారెం కిషోర్ కుమార్ రెడ్డి సోమవారం రాష్ట్ర ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాడు. అలాగే కేవీపల్లి మండలం జిల్లేలమంద గ్రామం, అర్రంరెడ్డిగారిపల్లికి చెందిన టీడీపీ ముఖ్యనాయకుడు వేణుగోపాల్ రెడ్డి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాడు. కార్యక్రమంలో నాయకులు దండు జగన్మోహన్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, ఎం.ఆర్.జి రెడ్డి, శీనా, మల్లికార్జున రెడ్డి, ప్రసాద్ రెడ్డి, జగన్నాథరెడ్డి, నాగసిద్దారెడ్డి, యల్లయ్య, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తన రచనల ద్వారా ప్రజలలో ఠాగూర్ ఐక్యతను నింపారన్నారు. అలాగే ఆయన రచించిన గీతాంజలి గేయాలకు నోబెల్ పురస్కారం లభించిందన్నారు. ఆయన రచించిన జనగణమన మన జాతీయ గీతం కావడం మన గర్వకారణమని, అమర్ సోనా బంగ్లాదేశ్ జాతీయ గీతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు అమరనాథ రెడ్డి, వసుమతి, నాగేశ్వర, పురుషోత్తం, శ్రీనివాస్ రెడ్డి, కల్పలత, భాస్కర్ నాయక్, మహబూబ్ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న పంచాయతీ సిబ్బంది

మదనపల్లె : మండలంలోని సీటీఎం పంచాయతీలో అనధికారికంగా వేసినఓ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు ఈఓఆర్డీ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కలిసి లేఅవుట్‌ను పరిశీలించారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ జీఓనెం.67 నిబంధనల ప్రకారం ప్రతి లేఅవుట్ యజమానులు సంబంధిత గ్రామ పంచాయతీ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా ప్లాట్లు విక్రయించడం చట్టరీత్యా నేరమని, కొనుగోలు చేసిన వ్యక్తులకు భవిష్యత్తులో భవన నిర్మాణాల అనుమతులు ఇవ్వడం జరగదన్నారు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసే వ్యక్తులు పంచాయతీ అనుమతులు ఉన్నవా లేదా చూసి కొనుగోలు చేయాలన్నారు. అక్రమలేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని ప్రజలను హెచ్చరించారు.

ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం

బి.కొత్తకోట: ఉమ్మడి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగకు దక్కుతుందని, ఆ సంఘ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుమ్ము చిన్నా అన్నారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య పథకం ప్రకటించిన రోజును పురస్కరించుకుని సోమవారం ఆరోగ్యశ్రీసాధన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల గుండె ఆపరేషన్ల చేయించలేని పరిస్థితుల్లో చనిపోతుండగా ప్రభుత్వమే వైద్యం చేయించాలన్న డిమాండ్‌తో కృష్ణ మాదిగ చేసిన ఉద్యమానికి ప్రభుత్వం స్పందించి ఆరోగ్యశ్రీ అమలులోకి తెచ్చిందన్నారు.